

పనస లోడ్‌లో గంజాయి..

పనసకాయల లోడ్ మధ్యలో గంజాయి ప్యాకెట్లు పెట్టి తరలిస్తుండగా అశ్వారావుపేట పోలీసులు పట్టుకున్నారు.

8లో



ఎమ్మెల్సీ ఓటు వేయండిలా..

సాధారణ ఎన్నికలతో పోలిస్తే శాసనమండలి పోలింగ్ భిన్నంగా ఉంటుంది. ఇందులో ఓటేసే విధానంపై కథనం..

8లో



వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రత అధికంగానే నమోదవుతుంది. రోజంతా ఉక్కపోత వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భ గుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞో పవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వారాంతపు సెలవురోజులు కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

నృసింహునికి తెప్పోత్సవం

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ యోగా నంద లక్ష్మీనరసింహ స్వామి వారికి శనివారం తెప్పోత్సవం, దొంగల దోపు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారి తిరుకల్యాణోత్స వాల్లో భాగంగా ప్రత్యేకంగా అలంకరించిన స్వామి, అమ్మవార్లను పల్లకీ సేవగా గోదావరి తీరానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత లాంచీలో జలవిహారం గావించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): వరంగల్ – ఖమ్మం – నల్గొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి చేశామని, 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటుహక్కు ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ప్రైవేట్ యాజమాన్యాలు, వాణిజ్య, పారిశ్రామిక సెంస్థల్లో పనిచేసే వారు కూడా ఓటు హక్కు వినియోగించుకునేందుకు విధులకు ఆలస్యంగా వచ్చేందుకు అనుమతి ఇవ్వాలని, లేదంటే వారు పని చేసే షిఫ్టులను సవరించాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునేందుకు యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

'పద్మ' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: 2025 సంవత్సరానికి గాను పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి పి.పరంధామ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి వచ్చే జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులను ప్రదానం చేస్తుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసేందుకు నియమ, నిబంధనల వివరాలు hhhtp;//padmaawards.gov.in ద్వారా పొందవచ్చని తెలిపారు. కళలు, సామాజిక కార్యక్రమాలు, పబ్లిక్ అఫైర్స్, సైన్స్‌తో పాటు వివిధ రంగాల్లో సాధించిన లక్ష్యాలు, చేసిన కృషిని 800 పదాలకు మించకుండా సంబంధిత పత్రాలను జతపరిచి email id: dysobhadradri@gmail.comనకు పీడీఎఫ్ ఫార్మట్‌లో సాఫ్ట్ కాపీలు పంపించాలని కోరారు. మూడు జతల హార్డ్ కాపీలను తమ కార్యాలయానికి ఈనెల 31లోగా పంపాలని సూచించారు.

వనరులు వినియోగించాలి



పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీపీఓ

ఇల్లెందురూరల్: పల్లె ప్రగతి పేరుతో గ్రామాలకు సమకూర్చిన వనరులు వినియోగంలో ఉండేలా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి సూచించారు. మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీలో పల్లె ప్రగతి ద్వారా చేపట్టిన నర్సరీ, పల్లె ప్రకృతివనం, వైకుంఠధామం, డంపింగ్ యార్డు షెడ్, ఎవెన్యూ ప్లాంటేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆయా నిర్మాణాల్లో ఏ ఒక్కటీ నిరుపయోగంగా మారకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శి రజియాబేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి తెర



ఉమ్మడి జిల్లాలో హోరెత్తించిన ఎమ్మెల్సీ అభ్యర్థులు

- చివరి రోజున ఆత్మీయ సమ్మేళనాలు
- ఇక ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంపై దృష్టి
- అధిక సంఖ్యలో పట్టభద్రులు ఉన్న ప్రాంతాలపై నజర్



సాక్షిప్రతినిధి, ఖమ్మం: నల్లగొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచారానికి శనివారం తెరపడింది. గతంలో ఎన్నడూ లేనట్టుగా ఈసారి అన్ని పార్టీలు ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. బరిలో ఉన్న అభ్యర్థుల తరఫున ఆయా పార్టీల అగ్రనేతలు ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ బలపరచిన తీన్మార్ మల్లన్న, ఏనుగుల రాకేష్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మధ్య ప్రధాన పోటీ ఉంటుందని తెలుస్తోంది. ఇదే సమయాన ఒకరిద్దరు స్వతంత్ర అభ్యర్థులు గట్టి పోటీ ఇస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థి, ఓయూ నిరుద్యోగ జేఏసీ నేత పాలకూరి అశోక్‌కుమార్ మూడు ఉమ్మడి జిల్లాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రస్తుతం ప్రచారం ముగియడంతో పట్టభద్రులను ప్రసన్నం చేసుకోవడంపై పార్టీలు దృష్టి సారించాయి.

సాధారణ ఎన్నికలను తలపించేలా..

సాధారణ ఎన్నికలను తలపించేలా ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సాగింది. ఇది బీఆర్‌ఎస్ సిట్టింగ్ స్థానం కావడం, మరోవైపు కాంగ్రెస్ అధికారంలో ఉండడం.. ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి రెండోస్థానంలో నిలవడం.. మరోపక్క ఎలాగైనా సత్తా చాటాలని బీజేపీ భావిస్తుండడంతో ప్రచారం రసవత్తరంగా సాగింది. కాంగ్రెస్ తరఫున మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ నుంచి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎంపీ అభ్యర్థి నామా, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు ఉధృతంగా ప్రచారం నిర్వహించారు. ఇక బీజేపీ తరఫున ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, రంగాకిరణ్, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి ప్రచారం చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఓయూ నిరుద్యోగ జేఏసీ నేత పాలకూరి అశోక్‌కుమార్ సైతం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వైఫల్యాలను వివరిస్తూ ప్రచారం చేయగా.. ఆయనకు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు, నిరుద్యోగులు పలువురు మద్దతుగా నిలిచారు.

ఓటర్ల ప్రసన్నం కోసం..

ప్రచారం ముగియడంతో అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టారు. ఓటర్లను నేరుగా కలిసేందుకు ప్రాధాన్యం ఇస్తూనే ఫోన్ చేయడమే కాక వాయిస్ మెసేజ్‌లు పంపిస్తున్నారు. పట్టభద్రుల నియోజకవర్గం మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉండడంతో అభ్యర్థులు స్థానిక నేతలకు బాధ్యతలు అప్పగించి చివరిరోజు ప్రచారం చేయించారు. ఇప్పటి వరకు అగ్రనేతలు ప్రచారం చేసినా, చివరిరోజు స్థానిక నేతలు పట్టభద్రులతో భేటీలు, ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి తమ పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఇక మూడు ఉమ్మడి జిల్లాల్లో పర్యటించలేని స్వతంత్ర అభ్యర్థులు వాయిస్ మెసేజ్‌లపైనే దృష్టి పెట్టారు. ఈ నేపథ్యాన అభ్యర్థుల వాయిస్ మెసేజ్‌లతో పట్టభద్రుల సెల్‌ఫోన్లు మార్మోగాయి.

అమల్లోకి 144 సెక్షన్

ఎమ్మెల్సీ పోలింగ్ సమీపించడంతో 144 సెక్షన్ అమల్లోకి వచ్చింది. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు ఇది అమల్లో ఉండనున్నందున ఒక ప్రాంతంలో ఎక్కువ మంది గుమికూడడాన్ని నేరంగా పరిగణిస్తారు. కర్రలు, జెండాలు, టపాసులు, ఇతర ఆయుధాలతో సంచరించడం, పోలింగ్ స్టేషన్‌కు కిలోమీటర్ పరిధిలో సమావేశాలు నిర్వహించడంపై నిషేధం విధించారు. ఇక ఎన్నికల రోజున పోలింగ్ స్టేషన్ల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టనున్నారు.

ఆ ప్రాంతాలే లక్ష్యంగా..

ఎక్కువ మంది పట్టభద్ర ఓటర్లు ఉన్న ప్రాంతాలను అభ్యర్థులు గుర్తించారు. ఆయా ప్రాంతాలే లక్ష్యంగా ఇప్పటికే ప్రచారం చేయగా, మిగిలిన సమయంలోనూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఇంటింటికీ వెళ్లాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఓటర్ల జాబితా ఆధారంగా పార్టీల నాయకులు ఇంటింటికీ తిరగడం మొదలుపెట్టారు. ఎక్కువ మంది ఓటర్లు ఉన్న ఖమ్మం, ఖమ్మంరూరల్, సత్తుపల్లి, నేలకొండపల్లి, వైరా, కొత్తగూడెం, ఇల్లెందు తదితర ప్రాంతాలపై అభ్యర్థులు ఎక్కువగా దృష్టి సారించి నేరుగా కలిసే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసిన నాటి నుంచి హోరాహోరీగా, గతంలో ఎన్నడూ లేనట్టుగా పట్టభద్రుల ఎన్నిక ప్రచారం జరగడం ఆసక్తి కలిగిస్తోంది.



అది ప్రశ్నించే గొంతు కాదు..

- తీన్మార్ మల్లన్నది బెదిరించే గొంతు
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రజలకు చేసిందేమీ లేదు
- పాలకులను నిలదీసే సత్తా బీజేపీకే ఉంది
- పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్



ఇల్లెందు సభలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్, పక్కన సీతారాంనాయక్, వినోద్‌రావు తదితరులు

ఇల్లెందు/చుంచుపల్లి/మణుగూరు : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నది ప్రశ్నించే గొంతు కాదని, అది బెదిరించే గొంతుక అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ ఆరోపించారు. ఇక బీఆర్‌ఎస్‌కు ఓటేసినా ప్రజలకు ఒరిగేది ఏమీ లేదని అన్నారు. ఖమ్మం – వరంగల్ – నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శనివారం ఆయన ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టభద్రులు, మేధావులు ఓటేస్తే వారిని పల్లా రాజేశ్వర్ రెడ్డి అపహాస్యం చేసి మధ్యలో నిండా ముంచాడని, ఆయన ఏనాడూ పట్టభద్రుల కోసం పని చేయలేదని అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు పట్టభద్రులకు డబ్బులు పంచినట్లు ప్రచారం సాగుతోందని, అలా చేస్తే పట్టభద్రులు లొంగిపోతారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తోందని, రాహుల్, ప్రియాంక, సోనియా గాంధీతో ఆరు డిక్లరేషన్లు ప్రకటింపజేసిన రేవంత్ రెడ్డి.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇంకేమీ చేయలేదని విమర్శించారు. అనేక హామీలిచ్చి మాట తప్పిన ముఖ్యమంత్రిని ప్రశ్నించే ధైర్యం తీన్మార్ మల్లన్నకు ఉందా అని ప్రశ్నించారు. హామీల అమలుకోసం మాట్లాడే ధైర్యం బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి మాత్రమే ఉందన్నారు. దేశం కోసం రోజుకు 18 గంటలు పని చేస్తున్న ఏకైక ప్రధాని నరేంద్ర మోదీనేనని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని 50 ఏళ్లకు పైగా, రాష్ట్రాన్ని 40 ఏళ్లకు పైగా పాలించినప్పటికీ పేద, మధ్యతరగతి ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందని, 1969 నుంచి మూడు తరాల ఉద్యమ చరిత్రలో తొలిసారి తూటా దెబ్బ తగిలింది ఖమ్మం వాసులకే అని గుర్తు చేశారు. విద్యార్థుల బలిదానాలతోనే రాష్ట్రం సిద్ధించిందని, కానీ పదేళ్లుగా ఉద్యోగాలు లేక యువత ఎదురుచూస్తోందని అన్నారు. గతంలో కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ విస్మరించారని, అదే దారిలో నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పని చేస్తోందని ఎద్దేవా చేశారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఊహించనన్ని సీట్లు వస్తాయని, ఖమ్మం, మహబూబాబాద్‌లోనూ విజయం తమదేనని ధీమా వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థులు తాండ్ర వినోద్‌రావు, అజ్మీరా సీతారాంనాయక్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.వి.రంగాకిరణ్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, నాయకులు హైమారెడ్డి, వై.వీ.రావు, సోమసుందర్, రాంచందర్‌నాయక్, దోమల మహేశ్వర్, మావునూరి మాధవ్, నిర్మలాదేవి, భూక్యా శ్రీనివాస్, విమల్‌జైన్, రేవళ్ల నాగరాజు, గోపీకృష్ణ, కనగంజి రమేష్, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జీవీకే మనోహర్‌రావు, పెడిపాటి రవీందర్, నరేంద్రబాబు, ఎడ్లపల్లి శ్రీనివాసరావు, పాలిశెట్టి వెంకటేశ్వర్లు, బైరి నిర్మల, గొడుగు శ్రీధర్, జంపన సీతారామరాజు, శ్రీనివాస్‌రెడ్డి, బిక్షపతి, సరస్వతి, వెంకటేశ్వర్లు, ఎల్. రమేష్, కుంజా రమేష్, బీర రమేష్, వెంకటేశ్వర్లు, దుర్గారావు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న ఈటల

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారిని మాజీ మంత్రి ఈటల రాజేందర్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ఈటల వెంట నాయకులు రంగాకిరణ్, సీతారాం నాయక్, కుంజా ధర్మ, తదితరులు ఉన్నారు.

గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు


పాల్వంచరూరల్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల బాలుర కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు పాల్వంచ మండలం కిన్నెరసానిలో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 350 మంది విద్యార్థులు హాజరుకాగా, అర్హులకు కృష్ణసాగర్, దమ్మపేట, కిన్నెరసాని, గుండాల, సింగరేణి, తిరుమలాయపాలెం కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లు కేటాయించనున్నట్లు ఆర్‌సీఓ వెంకటేశ్వరరాజు తెలిపారు. కౌన్సెలింగ్‌లో కళాశాలల ప్రిన్సిపాళ్లు గోవర్ధన్, హరిసింగ్, జాన్‌నాయక్, పుల్లయ్య, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

రామయ్య కల్యాణతంతుపై ఆరా?

భద్రాచలం: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో కొంత కాలంగా రామనారాయణ వివాదం సాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఆలయ అర్చకులు, వేదపండితుల నుంచి దేవాదాయ శాఖ ఉన్నతాధికారి ఒకరు వివరాలు అడిగినట్లు సమాచారం. వైదిక సిబ్బంది నుంచి వ్యక్తిగతంగా సమాచారం ఇవ్వమని అడిగినట్లుగా తెలుస్తోంది. గత 12 సంవత్సరాలుగా కల్యాణం జరిగిన, జరుగుతున్న తీరును స్పష్టంగా ప్రతీ ఒక్కరు సమాచారం ఇవ్వాలని కోరారని ప్రచారం జరుగుతోంది.

విద్యార్థులు మరింతగా రాణించాలి

ఎస్పీ రోహిత్‌రాజ్



విద్యార్థినిని అభినందిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని, భవిష్యత్‌లో మరింతగా రాణించాలని ఎస్పీ రోహిత్‌రాజ్ ఆకాంక్షించారు. కొత్తగూడెంలోని ఐఎంఏ హాల్‌లో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన 35 మంది విద్యార్థులను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలని, తద్వారా తల్లిదండ్రులతో పాటు తమ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని పిలుపునిచ్చారు. పోలీసు శాఖలో అహర్నిశలూ కష్టపడి విధులు నిర్వహిస్తున్న తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. పట్టుదలతో సాధిస్తే సాధ్యం కానిది ఏదీ లేదన్నారు. ఇంటర్, డిగ్రీ చదివే దశలోనే విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉంటుందని, ఈ సమయంలోనే సన్మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్‌సింగ్, కొత్తగూడెం, ఇల్లెందు డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, చంద్రభాను, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, వెల్ఫేర్ ఆర్‌ఐ కృష్ణారావు, ఎంటీఓ సుధాకర్, హోంగార్డ్ ఆర్‌ఐ నర్సింహారావు పాల్గొన్నారు.

ఇంటిని మరిపించేలా పాఠశాలలు

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



అంకంపాలెం ఆశ్రమ పాఠశాల ఆవరణలో పరిశీలిస్తున్న పీఓ తదితరులు

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట : గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలను ఇంటిని మరిపించేలా సిద్ధం చేస్తున్నట్లు ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ తెలిపారు. అశ్వారావుపేట మండలం భీమునిగూడెం ఆశ్రమ పాఠశాలను, దమ్మపేట మండలంలోని అంకంపాలెం, పార్కలగండి, పెద్దగొల్లగూడెం, చీపురుగూడెం ఆశ్రమ పాఠశాలలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలల ఆవరణల్లో పచ్చదనాన్ని మరింతగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల వసతి గదులను పరిశీలించి మంచాలు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు సరిపడా ఉన్నాయా లేవా అని ఆరా తీశారు. పాఠశాలల పునః ప్రారంభం నాటికి విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ ఉదయ్‌భాస్కర్, డీఈ రామిరెడ్డి, ఏటీడీఓ చంద్రమోహన్, ఏఈ సుబ్బరాజు, పాఠశాలల హెచ్‌ఎంలు పద్మ, తోలెం వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, భద్రమ్మ, ధర్మ పాల్గొన్నారు.

పనస లోడ్‌లో గంజాయి..

- కాయల మధ్యలో ప్యాకెట్లు పేర్చి తరలింపు
- 3.59 క్వింటాళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు



పనసకాయల మాటున గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న వాహనం

అశ్వారావుపేట: పనసకాయల లోడ్‌లో తరలిస్తున్న గంజాయిని శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం.. శనివారం మధ్యాహ్నం 12.45 గంటలకు పట్టణంలోని సాయిబాబా ఆలయం వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో బొలెరో వాహనం ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా దారకొండ నుంచి హైదరాబాద్‌లోని దూల్‌పేటకు పనసకాయల లోడ్‌తో వెళ్తోంది. ఆపి తనిఖీ చేయగా, పనసకాయల మధ్యలో 165 ప్యాకెట్ల గంజాయి లభ్యమైంది. హైదరాబాద్‌కు చెందిన చింతమన్ సంతోష్ సింగ్, రామ్‌పురి గోపి సింగ్‌ల సూచన మేరకు అదే ప్రాంతానికి చెందిన విక్రమ్‌సింగ్, శైలేందర్ సింగ్‌లు దారకొండలో గంజాయి కొనుక్కుని వస్తున్నారు. తిరుగుప్రయాణంలో రాజమండ్రి వద్ద సంతోష్‌సింగ్, గోపిసింగ్ వాహనం ఎక్కారు. అశ్వారావుపేట మీదుగా హైదరాబాద్ వెళ్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. హైదరాబాద్‌లోని ఆదిత్యసింగ్, మహేందర్‌సింగ్‌లకు అమ్మేందుకు గంజాయి తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో పోలీసులు రూ. 89,83,000 విలువైన 3.59 క్వింటాళ్ల గంజాయి, బొలెరో వాహనం, ఐదు సెల్‌ఫోన్లు, పనసకాయలను సీజ్ చేశారు. పట్టుబడ్డ నలుగురు నిందితులతోపాటు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న చింతమన్ దీపిక, దారకొండకు చెందిన కోమిటి, సీలేరుకు చెందిన మూడ్ లక్ష్మణ్, ఒడిశా మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండకు చెందిన రాజయ ముడా, హైదరాబాద్‌కు చెందిన ఆదిత్య సింగ్, మహేందర్ సింగ్, ఆదిలాబాద్ జిల్లా తోసమ్‌కు చెందిన కోట్నక్ రమేష్‌తో కలిపి మొత్తం 11 మందిపై కేసు నమోదు చేశారు. పట్టుబడ్డ నలుగురిని రిమాండ్‌కు తరలించామని, మిగతా ఏడుగురు పరారీలో ఉన్నారని ఎస్‌ఐ తెలిపారు.

భద్రాచలంలో భారీగా స్వాధీనం?

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో శనివారం పోలీసులు భారీగా గంజాయి పట్టుకున్నట్లు సమాచారం. ఓ వాహనాన్ని ఎస్కార్ట్‌గా ఉపయోగిస్తూ మరో వాహనంలో ప్లైవుడ్ మాటున గంజాయిని తరలిస్తున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నిందితుల్లో ఐదుగురు సంగారెడ్డికి చెందినవారని, మిగిలిన ఇద్దరు మల్కన్‌గిరి, బీదర్‌కు చెందిన వారిగా గుర్తించినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎమ్మెల్సీ ఓటు వేయండిలా..

- బరిలో ఉన్న అభ్యర్థులందరికీ ఓటు వేయొచ్చు
- '1'ప్రాధాన్యత అంకె ఇవ్వకుండా మిగతావి ఇస్తే ఆ ఓటు చెల్లదు
- అధికారి ఇచ్చిన పెన్నునే ఉపయోగించాలి
- రేపు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు



నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ రేపు జరగనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 52 మంది అభ్యర్థులు ఉన్నారు. ఈ ఉప ఎన్నిక బ్యాలెట్ పేపర్ పద్ధతిన నిర్వహిస్తున్నారు. అయితే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇతర సాధారణ ఎన్నికలకు ఓటు వేసే విధానంలో చాలా తేడా ఉంటుంది. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ఓటు వేసే క్రమంలో ఈవీఎంలను వాడతారు. ఆ ఎన్నికల్లో అభ్యర్థి పేరు, పార్టీ గుర్తు ఉంటుంది. ఒకే అభ్యర్థికి ఓటు వేయాల్సి ఉంటుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అందుకు భిన్నంగా ఉంటాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరికీ ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేసే అవకాశం ఓటర్లకు ఉంటుంది.

ప్రాధాన్యత క్రమంలోనే ఓటు..

- ప్రతి ఓటరు బరిలో ఉన్న మొత్తం అభ్యర్థుల్లో ఒక్కరికి లేదా కొందరికి లేదా అందరికీ ఓటేయవచ్చు.
- కేవలం అంకెలు మాత్రమే ఆ బాక్సులో ప్రాధాన్యత క్రమంలో వేయాల్సి ఉంటుంది.
- మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తేనే ఆ ఓటు చెల్లుబాటు అవుతుంది.
- ఏ వ్యక్తికైతే మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తారో ఆ వ్యక్తి బ్యాలెట్ పేపర్ వరుసలో ఏ నంబర్‌లో ఉన్నా కూడా.. బాక్సులో 1 అనే అంకె వేయాల్సి ఉంటుంది.
- 1, 2, 3, 4, 5 ఇలా ప్రాధాన్యత క్రమంలో పోటీలో ఉన్న అభ్యర్థులకు ఓటు వేయాలి.

కేవలం ఒక్కరికి కూడా ఓటేయొచ్చు

- పోటీలో ఎంత మంది అభ్యర్థులు ఉన్నా అందులో 40వ సీరియల్ నంబర్‌లో ఉన్న అభ్యర్థికి ఒక్కరికే ఓటు వేయాలంటే అతడికి ఎదురుగా ఉన్న బాక్సులో 1 అని ఓటు వేసి మిగతా వారికి వేయకున్నా ఆ ఓటు చెల్లుతుంది.
- 1వ నంబర్ ప్రాధాన్యత ఓటు వేయకుండా 2, 3, 4 నంబర్లతో ఓట్లేస్తే ఆ ఓటు చెల్లదు.
- తప్పనిసరిగా 1 నుంచి సీరియల్‌గా మాత్రమే ఓటు వేయాలి.
- ఒక అభ్యర్థికి ఒక అంకెను మాత్రమే వేయాలి.
- అంకెలను తెలుగులో కానీ, ఇంగ్లిష్‌లో, ఇతర భాషల్లో వన్, టు, త్రీ అని పదాలు, అక్షరాల్లో రాయకూడదు.
- బ్యాలెట్ పేపర్‌పై ఎలాంటి సంతకాలు చేయకూడదు.
- వేలిముద్ర వేయకూడదు.
- అభ్యర్థికి ఎదురుగా ఉన్న బాక్సులో రైట్ గుర్తు, ఇంటు గుర్తు పెట్టకూడదు.

ఓటు వేసే విధానం..

- ప్రతి అభ్యర్థికి ఎదురుగా పార్టీ పేరు లేదా స్వతంత్ర అభ్యర్థి అని రాసి ఉంటుంది.
- పార్టీల గుర్తులు ఉండవు.
- అభ్యర్థి పేరు ఎదురుగా ఖాళీ బాక్స్ ఉంటుంది.
- పోలింగ్ అధికారి ఇచ్చిన పెన్నుతో మాత్రమే ఓటరు తన ఓటు వేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థి పేరు ఎదురుగా ఖాళీ బాక్స్‌లో పెన్నుతో కేవలం నంబర్ మాత్రమే వేయాల్సి ఉంటుంది.

సొంత పెన్నుతో ఓటు వేయవద్దు..

- బ్యాలెట్‌లో ఓటర్ ఓటు వేసేటప్పుడు సొంత పెన్నుతో ఓటు వేయరాదు.
- అలా వేస్తే ఓటు చెల్లదు.
- ఒకరికి ఇచ్చిన ప్రాధాన్యత ఓటు మరో అభ్యర్థికి ఇచ్చినా ఆ ఓటు చెల్లదు.
- ఒకరికి 1వ నంబర్ వేసి దాన్ని పదేపదే దిద్దినా ఆ ఓటు చెల్లకుండా పోతుంది.
- బ్యాలెట్ పేపర్‌ను బాక్సులో వేయకుండా తీసుకెళ్తే కేసు నమోదు చేస్తారు.
- బాక్సు మధ్యలో మాత్రమే నంబర్ రాయాల్సి ఉంటుంది.
- రిటర్నింగ్ అధికారి ఇచ్చిన ఊదా రంగు స్కెచ్ పెన్నుతో గాక ఇతర ఏ పెన్నులతో రాసినా అది చెల్లుబాటు కాదు.
- ఏ అంకెలు వేయకుండా ఖాళీ బ్యాలెట్ పేపర్ ఇచ్చిన ఆ ఓటు చెల్లుబాటు కాదు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు



హరితహారం నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రాజీవ్ కుమార్

అశ్వారావుపేటరూరల్: విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని డీఎల్‌పీవో రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని అచ్యుతాపురం, నారంవారిగూడెం, నారంవారిగూడెం కాలనీ గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలతోపాటు హరితహారం నర్సరీలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ప్రతీ రోజు పరిశీలించాలని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. జీపీఎస్‌లు వై.వెంకటేశ్వర్లు, బిట్రా.వెంకటేశ్వర్లు, వెంకటమ్మ ఉన్నారు.

కారుణ్య కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కొణిజర్ల: భద్రాచలంలో నర్సింగ్ చదువుతూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పి.కారుణ్య మృతదేహం వద్ద వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శనివారం నివాళులర్పించారు. ఆమె స్వగ్రామమైన కొణిజర్ల మండలం సిద్ధిక్‌నగర్‌లో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థిని కుటుంబీకులను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, నాయకులు కోసూరి శ్రీను, రాయల పుల్లయ్య, శేషగిరిరావు, నారాయణరావు, హరినాద్, మోష, కృష్ణారావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేలకూలిన భారీ వృక్షం



రోడ్డుకు అడ్డంగా పడ్డ చింతచెట్టు

ములకలపల్లి: కొద్ది రోజులుగా కురుస్తున్న ఈదురుగాలులతో కూడిన వర్షాలకు మండల పరిధిలోని కొత్తగంగారం అటవీప్రాంతంలో సుమారు వందేళ్ల వయసున్న చింత చెట్టు నేలకూలింది. పాల్వంచ– మండలపల్లి ఆర్‌అండ్‌బీ రహదారికి అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ఎస్సై రాజమౌళి ఆధ్వర్యంలో తొలగింపు చర్యలు చేపట్టారు. కట్టర్ సహాయంతో చెట్టును ముక్కలుగా కోసి తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు.

క్లుప్తంగా

1 నుంచి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

పాల్వంచరూరల్: పాల్వంచలోని కేటీపీఎస్ టీఆర్‌సీ ఇండోర్ స్టేడియంలో వచ్చే నెల 1, 2 తేదీల్లో జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఇంటూరి రవికుమార్ తెలిపారు. శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. 11 నుంచి 19 సంవత్సరాల లోపు వయసు కలిగిన క్రీడాకారులు అర్హులని, పోటీల్లో ప్రతిభ చూపినవారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తికలిగిన క్రీడాకారులు ఈ నెల 29న ఎంపికలకు హాజరుకావాలని, వివరాలకు 98667 93238 నంబరు సంప్రదించాలని కోరారు. ఈసమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌రావు, కార్యదర్శి కె.సావిత్రి, జాయింట్ సెక్రటర్ హరి ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌లతో క్రీడానైపుణ్యం



ఉషూ శిక్షణను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తగూడెంటౌన్ : వేసవి క్రీడా క్యాంపులతో క్రీడాకారులు నైపుణ్యం పెంపొందించుకోవచ్చని జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి పి.పరంధామరెడ్డి తెలిపారు. కొత్తగూడెం ప్రగతిమైదానంలో టెన్నిస్, క్రికెట్, బాబుక్యాంప్‌లో ఉషూ క్రీడల్లో నిర్వహిస్తున్న వేసవి క్యాంపులను ఆయన శనివారం పర్యవేక్షించారు. పిల్లలు, కోచ్‌లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వేసవి క్రీడాశిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్సై డ్రైవర్ అనుచితంగా ప్రవర్తించాడు..

సీఐ కార్యాలయం ఎదుట బైఠాయించిన మహిళ

కారేపల్లి: కారేపల్లి ఎస్సై ఎన్.రాజారాం డ్రైవర్‌గా పనిచేస్తున్న హోంగార్డు మల్లేశం తనతో అనుచితంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ ఓ మహిళ తన భర్త, పిల్లలతో కారేపల్లి సీఐ కార్యాలయం ముందు శనివారం బైఠాయించి నిరసన తెలిపింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మేకలతండా గ్రామానికి చెందిన బానోతు రాజేష్, బానోతు రవి మధ్య బంగారం రుణం, ట్రాక్టర్‌తో దుక్కిదున్నిన పైకానికి సంబంధించిన లావాదేవీల వివాదం నడుస్తోంది. ఈ అంశంపై మూడు నెలల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేయగా పెద్దల సమక్షాన ఒప్పందం కుదుర్చుకున్నారు. అయినా వివాదం సద్దుమణగకపోవటంతో కారేపల్లి ఎస్‌ఐ రాజారాం, డ్రైవర్ మల్లేశం శుక్రవారం రాత్రి 7గంటల సమయంలో మేకలతండా గ్రామానికి వెళ్లారు. అక్కడ ఎస్‌ఐ వాహనంలోనే ఉండగా, డ్రైవర్ మల్లేశం వెళ్లి రాజేష్ ఉన్నాడా అని ఆరా తీయగా లేడని ఆయన భార్య వాణీశ్వరి చెబుతుండగానే డ్రైవర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎన్నిసార్లు పిలిచినా రావడం లేదంటూ తన చెయ్యి పట్టుకొని చేతులో ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని అసభ్యంగా మాట్లాడుతుండగా గట్టిగా అరవడంతో వెళ్లిపోయాడని వాణీశ్వరి వాపోయింది. ఈ అంశంపై శుక్రవారం రాత్రే ఆమె కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఎస్‌ఐ విచారణ

వాణీశ్వరి ఫిర్యాదుతో ఎస్‌ఐ రాజారాం, ఏఎస్‌ఐ నాగరాజకుమారి శనివారం మేకలతండాకు వెళ్లి విచారణ చేపట్టారు. ఈక్రమంలో డ్రైవర్ మల్లేశంపై చర్యలు తీసుకోవాలని, రాత్రి సమయాన ఇంటికి వచ్చి మహిళతో వ్యవహరించడం తీరు సరిగ్గా లేదని స్థానికులు వాపోయారు. అనంతరం ఎస్‌ఐ తీరుతో తమకు న్యాయం జరగదని చెబుతూ వాణీశ్వరి తన భర్త, పిల్లలతో కలిసి కారేపల్లి సీఐ ఆఫీసు ముందు బైఠాయించింది. వీరికి బంధువులు తోడు రావడంతో సీఐ తిరుపతిరెడ్డి నచ్చచెప్పే ప్రయత్నం చేసినా ససేమిరా అనడంతో సీపీ, ఏసీపీ దృష్టికి తీసుకెళ్లారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

నేడు సీనియర్ నెట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ పురుషులు, మహిళల నెట్‌బాల్ జట్ల ఎంపికకు ఆదివారం ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.ఫణికుమార్ తెలిపారు. హాజరయ్యే క్రీడాకారులు వయసు ధృవీకరణ పత్రాలతో ఉదయం 8గంటలకు రిపోర్టు చేయాలని కోరారు. ఇక్కడ ఎంపిక చేసే జట్లు ఈనెల 30నుంచి హైదరాబాద్‌లోని దోమలగూడ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు.

సైబర్ క్రైం కేసులు నమోదు

పాల్వంచరూరల్: ముగ్గురు ప్రైవేటు ఉద్యోగులు సైబర్ మోసానికి గురైన సంఘటనలపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ పట్టణంలోని మంచికంటినగర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి కృష్ణతేజ వాట్సాప్‌నకు ఓ లింక్ రాగా ఓపెన్ చేసి ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో రూ.86 వేల పెట్టుబడి పెట్టాడు. అయితే రూ.2 లక్షల పెట్టుబడి పెడితే రెట్టింపు నగదు వస్తుందని చెప్పడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాంకుమార్ అనే మరో ప్రైవేటు ఉద్యోగి మరో యాప్‌లో రూ.30 వేలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. నవభారత్ ఏరియాకు చెందిన ఎండీ నయీముద్దీన్ చైన్‌లింక్ యాప్‌ను ఓపెన్ చేసి రూ.2.17 లక్షలు పెట్టుబడి పెట్టాడు. ఆ లింకు ఓపెన్ కాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మూడు ఘటనలపై సైబర్ క్రైం కేసులు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై రాఘవ తెలిపారు.

చోరీ కేసు..

పట్టణ పరిధిలోని కాంట్రాక్టర్స్ కాలనీలో శనివారం చోరీ జరిగింది. కాలనీకి చెందిన దేవినేని రోజా హైదరాబాద్ వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి రూ.5 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు చోరీ చేశారని ఫిర్యాదు చేయగా, పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓబీ కార్మికులకు వేతన ఒప్పందం



ఎమ్మెల్యే సమక్షంలో ఓబీ కంపెనీ ప్రతినిధులకు ఒప్పంద పత్రం అందజేస్తున్న నాయకులు

మణుగూరు టౌన్: సింగరేణి మణుగూరు ఏరియాలో మట్టివెలికితీత(ఓబీ) పనులు నిర్వహిస్తున్న మహాలక్ష్మి ఇన్‌ఫ్రా కంపెనీ యాజమాన్యంతో కార్మికులకు వేతన ఒప్పందం కుదిరింది. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చొరవతో ఐఎన్‌టీయూసీ మధ్యవర్తిత్వంతో ఒప్పందం కుదిరినట్లు ఐఎన్‌టీయూసీ అనుబంధ ఓబీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సిల్వేరు గట్టయ్య తెలిపారు. శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. ప్రస్తుత వేతనానికి అదనంగా రూ.1900 బేసిక్ పెంచినట్లు తెలిపారు. ప్రత్యేక చొరవ చూపి కాంట్రాక్ట్ కార్మికుల వేతన ఒప్పంద సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి సూరపాక రాములు, ఏరియా ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షుడు వత్సవాయి కృష్ణంరాజు, నాయకులు జీవరత్నం, మహాలక్ష్మి యాజమాన్య ప్రతినిధులు జేస్ పాండే, ఓబీ వర్కర్స్‌బ్రాంచి కమిటీ సభ్యులు, ఐఎన్‌టీయూసీ అనుబంధ ఓబీ వర్కర్స్ మహాలక్ష్మి ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతిమయాత్రకూ అవస్థలే..



వాగులో నుంచి అంతిమయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

పట్టణంలోని ఇల్లెందులపాడు హిందూ శ్మశానవాటికలో మృతదేహాల ఖననం కష్టంగా మారింది. గతేదాది కురిసిన వర్షాలకు ఇల్లెందులపాడు చెరువు అలుగువాగు బ్రిడ్జి కొట్టుకుపోయింది. తిరిగి నిర్మించకపోవడంతో ప్రమాదభరితంగా మారింది. శ్మశానవాటిక వద్దకు వాహనం వెళ్లే పరిస్థితి లేదు. వాగు వద్దే నిలపాల్సి వస్తోంది. శనివారం ఓ మృతదేహాన్ని ఇలా.. వాగులో నుంచి శ్మశాన వాటికకు తీసుకెళ్లి ఖననం చేశారు. – ఇల్లెందు

ఆగి ఉన్న కారును ఢీకొట్టిన డీసీఎం

- బాలుడి మృతి, మరో ఏడుగురికి గాయాలు
- హైదరాబాద్‌లో ఔటర్ రింగ్‌రోడ్‌పై ఘటన



పూజిత్ రామ్ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డుపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. అతని తల్లిదండ్రులు, సోదరితోపాటు మరో నలుగురు బంధువులు గాయపడ్డారు. భద్రాచలంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన వెంకటగోపి తన కుటుంబ సభ్యులతో కలిసి వేసవి సెలవులకు హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం వెంకటగోపి, అతని భార్య దీప్తి, కూతురు వేదశ్రీ, కుమారుడు పూజిత్‌రామ్(13) మరో నలుగురు బంధువులు కలిసి కారులో కూకట్‌పల్లి నుంచి బీబీ నగర్‌కు ఔటర్ రింగ్‌రోడ్డు మీదుగా వెళ్తున్నారు. ఈ క్రమంలో దీప్తి, వేదశ్రీ, పూజిత్ రామ్, బంధువు రమాదేవిలకు వాంతులు కావడంతో కారును రోడ్డు పక్కన నిలిపారు. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం అదుపు తప్పి కారును ఢీకొట్టింది. దీంతో పూజిత్ రామ్(13) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఏడుగురికి గాయాలయ్యాయి. వెంకటగోపి హైదరాబాద్(తిరుమలగిరి)లోనే మరో బంధువు శ్రీపాద నూతన్‌కు సమాచారం అందించగా, అతను సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం బాలుడి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా పూజిత్‌రామ్ సారపాక బీపీఎల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. గాయపడ్డవారిలో ఆరు నెలల బాబు కూడా ఉన్నాడు.

గుండెపోటుతో ఇద్దరు మృతి

గుండాల: గుండెపోటుతో శనివారం ఇద్దరు మృతి చెందారు. మండలంలోని మామకన్ను గ్రామానికి చెందిన గొగ్గెల సత్యనారాయణ(35) నిద్రనుంచి లేచి ఆరు బయట మంచంలో కూర్చొని ఉండగా గుండెలో నొప్పి వస్తుందని చెప్పుతూనే ఒక్కసారిగా మంచంలో పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు వచ్చి చూడగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మండలంలోని ముత్తాపురం గ్రామానికి చెందిన పూనెం పాపయ్య (55) శనివారం ఉదయాన్నే గుండెపోటుతో మృతి చెందాడు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

దమ్మపేట: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ముష్టిబండ గ్రామ శివారులో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ముష్టిబండ గ్రామానికి చెందిన కోలేటి ధర్మరాజు(41) శనివారం తెల్లవారుజామున గ్రామశివారులో కాలకృత్యాలు తీర్చుకుని తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి తండ్రి పెద్ద వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

భార్య మృతి చెందిన నెలరోజులకే..

అనారోగ్యంతో భర్త మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

ఇల్లెందు: పట్టణంలోని ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు కటకం లక్ష్మీనారాయణ(65) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నెలరోజుల క్రితం లక్ష్మీనారాయణ భార్య కళావతి గుండెపోటుతో మృతి చెందింది. భార్య మరణాన్ని తట్టుకోలేకపోయిన ఆయన తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. దీంతో ఆరోగ్యం క్షీణించింది. శనివారం గుండెపోటుతో మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి

మణుగూరు టౌన్: తెగిపడ్డ విద్యుత్ వైర్లకు తగిలి విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని రామానుజవరం గ్రామ పంచాయతీలో శనివారం జరిగింది. ఎల్లమాటి వెంకట్రావు పొలం వద్ద విద్యుత్ వైర్లు తెగి పడి ఉండగా, అటు వైపు వెళ్లిన గేదెలు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాయని బాధిత రైతు తెలిపాడు. గమనించిన స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు.